ప్రజాశక్తి
గురువారం 3 ఏప్రిల్, 2025
5
శ్రీకాకుళం



8న జెడ్‌పి సాధారణ సర్వసభ్య సమావేశం

సిఇఒ శ్రీధర్‌రాజు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ సమావేశానికి చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షత వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.



12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలి

- 57 మెమోను అమలు చేయాలి
- కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ధర్నా



ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

12వ పిఆర్‌సి కమిషన్ చైర్మన్‌ను నియమించడంతో పాటు 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ బమ్మిడి శ్రీరామ్మూర్తి, సెక్రటరీ జనరల్ పి.ప్రతాప్ కుమార్ డిమాండ్ చేశారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో నంబరు 57ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆలస్యమైన 30 శాతం ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలు, పెండింగ్ డిఎలను విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించినా, నాటి చైర్మన్ మన్మోహన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారని గుర్తుచేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం 12వ పిఆర్‌సి కమిషన్‌కు చైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. లోపభూయిష్టమైన 11వ పిఆర్‌సిలో లోపాలను సరిచేస్తామని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. 2003 డిఎస్‌సి ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను అమలు చేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలన్నారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్య పరిష్కరించి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వానికి మొట్టమొదటిసారిగా ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న పోరాటమని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్.కిషోర్ కుమార్, చౌదరి రవీంద్ర, ఎల్.బాబూరావు (యుటిఎఫ్), మజ్జి మదన్‌మోహన్ (ఎపిటిఎఫ్ 257), టి.చలపతిరావు, బి.రవికుమార్ (ఎపిటిఎఫ్ 1938), ఎస్.వి రమణమూర్తి (ఎస్‌టియు), పి.హరిప్రసన్న, కె.అప్పలరాజు (డిటిఎఫ్), వి.సత్యనారాయణ (హెచ్‌ఎంల సంఘం) పాల్గొన్నారు.

'కనీళ్ల' పేట

- గల్లంతైన ఇద్దరు మత్స్యకారులు మృతి
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం
- ఎమ్మెల్యే గౌతు శిరీష



రోదిస్తున్న కుటుంబసభ్యులు



ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

మండలంలోని మంచినీళ్లపేట కన్నీటి రోదనతో మిన్నంటింది. సముద్ర తీరంలో మంగళవారం వేకువజామున రాకాసి అలలకు గల్లంతైన మత్స్యకారులు విగతజీవులుగా బుధవారం తీరానికి కొట్టుకొచ్చారు. గ్రామస్తులు బృందాలుగా విడిపోయి నిద్రాహారాలు మానుకుని రాత్రంతా గాలింపు చర్యలు చేపట్టారు. ప్రాణాలతో ఇంటికి వస్తారని ఎదురుచూసిన కుటుంబాల ఆశలు ఆవిరయ్యాయి. అక్కుపల్లి తీరానికి మృతదేహాలు కొట్టుకొచ్చాయన్న విషయం తెలియగానే ఒక్కసారిగా ఘొల్లుమన్నాయి. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మండలంలోని మంచినీళ్లపేటకు చెందిన చెందిన గొంగు కోటేశ్వరరావు, బొంగు ధనరాజు, వంక కృష్ణ, చింత వెంకటేష్ మంగవారం వేకువజామును మంచినీళ్లపేట-నువ్వలరేవు తీరలో ఉన్న సముద్రతీరానికి వెళ్లి చేపలవేటకు బోటను సముద్రంలో దింపారు. కొంత దూరం వెళ్లేసరికి రాకాసి అల బోటుపై విరుచుకుపడింది. రాకాసి ఆల ధాటికి బోటు ఒక్కసారిగా సముద్రంలో బోల్తా పడింది. బోటుపై ఉన్న నలుగురు మత్స్యకారులు సముద్రంలో పడిపోయారు. చీకటిగా ఉండడంతో ఎవరు ఎక్కడ ఉన్నారో గర్తించలేకపోయారు. దీంతో చింత వెంకటేష్ అతి కష్టంపై ఈదుకుంటూ ఒడ్డుకు చేరారు. అలల తాకిడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బొంగు కోటేశ్వరరావును సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన మరో బోటు ఉన్న మత్స్యకారులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. వంక కృష్ణ (44), బొంగు ధనరాజు (45) ఆచూకీలు లభ్యం కాలేదు. దీంతో వీరు సముద్రంలో గల్లంతైనట్లు గర్తించిన మిగతా మత్యకారులు సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టారు. మైరైన్ సిఐ రాము, కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతిరావు, వజ్రపుకొత్తూరు ఎస్ఐ నిహార్ ఆధ్వర్యాన తీరంలో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రయినా వారి ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం అక్కుపల్లి తీరానికి కృష్ణ, ధనురాజ్ మృతదేహాలు కొట్టుకొచ్చాయి. మృతదేహాలను గుర్తించి ఫైబర్ తెప్పలపై గ్రామానికి తరలించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీటి రోదనలు మిన్నంటాయి.

గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. శవపంచనామా నిర్వహించి పలాస ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్ఐ నిహార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఎమ్మెల్యే గౌతు శిరీష మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీనిచ్చారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, సురాడ మోహనరావు, గోవింద పాపారావు, గుళ్ల చిన్నారావు, ఆకుల పాపారావు, అరసవల్లి ఉమామహేష్, వంక రామారావు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం

మృతుల కుటుంబాలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.పది లక్షల నష్టపరిహారం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు, మత్స్యశాఖ నుంచి మరో రూ.ఐదు లక్షలు ప్రకటించగా, మొత్తంగా ఒక్కో కుటుంబానికి రూ.పది లక్షలు అందించనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో మృతుల కుటుంబాలకు అండగా నిలిచినట్లు మంత్రి తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని భరోసానిచ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా మత్స్యకారులకు తగిన సూచనలు, సలహాలు అందించి, ప్రమాద నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. మత్స్యకారుల భద్రతకు అవసరమైన అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఇదే సమయంలో, సముద్ర వేటకు వెళ్లే మత్స్యకారులకు అత్యవసర భద్రతా చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలన్నారు.

కుప్పిలి ఘటనలో ముగ్గురిపై సస్పెన్షన్ ఎత్తివేత

- ఇద్దరిపై సస్పెన్షన్ యథాతథం
- వారిపైనే క్రిమినల్ కేసులు
- ఉపాధ్యాయ సంఘాలతో కలెక్టర్ సమావేశం
- స్పాట్ వాల్యుయేషన్‌కు హాజరు కావాలని నిర్ణయం



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ పరీక్ష కేంద్రంలో మాల్ ప్రాక్టీస్ ఘటనలో మరో ముగ్గురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నిర్ణయం తీసుకున్నారు. సస్పెన్షన్ నుంచి ఉపశమనం పొందిన వారిలో ఉపాధ్యాయులు ఎస్.కృష్ణారావు, పి.నాగేశ్వరరావు, కె.కామేశ్వరరావు ఉన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో జెఎసి చైర్మన్ హనుమంతు సాయిరాం, ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. డిఇఒ తిరుమల చైతన్యను విధుల నుంచి తొలగింపు, మిగిలిన ఉపాధ్యాయులపై సస్పెన్షన్ల ఎత్తివేత, ఉపాధ్యాయులపై కేసుల ఎత్తివేత తదితర డిమాండ్లను వారు కలెక్టర్ ముందుంచారు. చూచిరాత వ్యవహారంలో ఒక ఉపాధ్యాయుడు, గుమస్తా ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయని, కాబట్టి ముగ్గురు ఉపాధ్యాయులపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. డిఇఒ తిరుమల చైతన్యపై రాష్ట్రస్థాయిలో డైరెక్టరేట్ ఆఫ్ ఎగ్జామినర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన విచారణ కమిటీ వేసినందున అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. స్పాట్ వాల్యుయేషన్ క్యాంపునకు దూరంగా ఉంచుతామని చెప్పారు. ఆర్‌జెడి విజయభాస్కర్ సమక్షంలో స్పాట్ వాల్యుయేషన్ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ ఇచ్చిన హామీలతో సంతృప్తి చెందిన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు గురువారం నుంచి నిర్వహించనున్న స్పాట్ వాల్యుయేషన్‌కు యధాతథంగా హాజరవుతున్నట్లు ప్రకటించారు.

నేపథ్యం ఇదీ...

ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో గత నెల 21 నిర్వహించిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష సందర్భంగా మాల్ ప్రాక్టీస్ జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో 14 మంది ఉపాధ్యాయులు, ఒక గుమస్తా మొత్తం 15 మందిపై డిఇఒ సస్పెన్షన్ వేటు విధించారు. ఇందులో ముగ్గురు ప్రధానోపాధ్యాయులు, పది మంది ఉపాధ్యాయులు, ఒక నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారు. వీరిలో ఆరుగురిపై ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు పెట్టారు. దీనిపై ఉపాధ్యాయులు పలురూపాల్లో ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను గత నెల 27న కలిసి సమస్యను వివరించారు. దీంతో ఏడుగురిపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నారు ఆ తర్వాత 28న డిఇఒ కార్యాలయంలో ఆర్‌జెడి విజయభాస్కర్‌తో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు చర్చలు జరిపిన తర్వాత మరో ముగ్గురిపై సస్పెన్షన్ ఎత్తివేశారు. మొత్తంగా పది మందిపై సస్పెన్షన్ ఎత్తివేశారు. తాజాగా మరో ముగ్గురిపై సస్పెన్షన్ ఎత్తివేయడంతో మొత్తం 13 మందిపై సస్పెన్షన్ తొలగించినట్లయింది.

సమస్య పరిష్కారంలో కలెక్టర్ ప్రత్యేక చొరవ

జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్న పదో తరగతి పరీక్షల వేళ డిఇఒ తిరుమల చైతన్య వ్యవహరించిన తీరుతో తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. ఉపాధ్యాయుల సస్పెన్షన్లు, విద్యార్థుల డిబార్ వంటి అంశాలు కలకలం రేపాయి. డిఇఒ దుందుడుకు వ్యవహారశైలిపై ఉపాధ్యాయ సంఘాలు పలురూపాల్లో ఆందోళనలు చేపట్టాయి. గురువారం నిర్వహించనున్న స్పాట్ వాల్యుయేషన్ సైతం బహిష్కరించాలని నిర్ణయించారు. ఈ విషయంలో కలెక్టర్ రెండుసార్లు జోక్యం చేసుకుని సమస్యకు ముగింపు పలకడంపై ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

గోడలపై రాతలు ఆకతాయిల పనే

- ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు
- ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, గుజరాతీపేట

శ్రీకాకుళం నగరంలోని పలు ప్రార్థనా మందిరాల గోడలపై విద్వేషాలు రెచ్చగొట్టేలా రాసిన రాతలు ఆకతాయిల పనేనని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎస్‌పి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళం టౌన్ హాల్ రోడ్డులోని ఆర్‌సిఎం సెయింట్ థామస్ చర్చి లోపల కాంపౌండ్ గోడ, చిన్నబజార్‌లోని తెలుగు బాప్టిస్టు చర్చిలోపల జై శ్రీరామ్ రాసిన ఘటనలపై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టామని చెప్పారు. శ్రీకాకుళం నగరం మేదర వీధికి చెందిన దుర్గాప్రసాద్, చేపల మార్కెట్ సమీపంలోని మేదర వీధికి చెందిన గ్రంధి సోమశేఖర్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని అన్నారు. వీరు ఆ చర్చిల గోడలపై ఎర్రని రంగుతో జై శ్రీరామ్ అని తెలుగులో రాసి అనంతరం ఇద్దరూ బైక్ వెళ్లిపోయారని తెలిపారు. డిఎస్‌పి సిహెచ్.వివేకనంద పర్యవేక్షణలో పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారని అన్నారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అరసవల్లి మామిడితోట సమీపంలో నిందితులను పట్టుకున్నామని తెలిపారు. గోడలపై రాతలు రాయడానికి కారణాలపై అనేక కోణాల్లో విస్తృత చర్యలు చేపట్టామని వివరించారు. దీనివెనుక ఎవరి ప్రేరణ లేదని నిర్ధారణ అయ్యిందన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన డిఎస్‌పి, ఒకటో పట్టణ సిఐ కె.పైడపునాయుడు, ఎస్ఐ హరికృష్ణ, హోంగార్డు నరేష్‌ను ఎస్‌పి అభినందించారు. జిల్లాలో 3,300 పైగా వివిధ రకాల ప్రార్థనా మందిరాలు ఉన్నట్లు గుర్తించామని, అన్నింటికీ భద్రత కల్పించలేమని అన్నారు. ఆందుకు ఆలయాల్లో, ప్రార్థనా మందిరల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని సూచించారు. గ్రామాల్లో యువకులతో యూత్, శాంతి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జలుమూరు ఘటన కేసు ఒక కొలిక్కి వస్తోందని, తొమ్మిది బృందాలను రంగంలోకి దించామని చెప్పారు. అనుమానస్పదంగా ఉన్న వ్యక్తులను గుర్తించి విచారణ చేపడుతున్నామని తెలిపారు. మత సామరస్యానికి భంగం కలిగించేలా, ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా కించపరిచేలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులను పెడితే వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పట్టణాల్లో కొత్త వ్యక్తులు అనుమానత వ్యక్తులు తారస పడితే వారి వివరాలు సంబంధించి పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్‌పి కె.వి.రమణ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి వేగం పెంచాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రెవెన్యూ, గ్రామ సచివాలయాలు, నీటి యాజమాన్య సంస్థ, గృహ నిర్మాణం, పారిశుధ్యం, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పల్లె పండగ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ఉపాధి హామీలో పని దినాలను పెంచాలన్నారు. గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, చెత్త నుంచి సంపద నిర్మాణ పనులను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే పిజిఆర్ఎస్ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సదస్సులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంకు నిర్వహణ, కోర్టు కేసుల పరిష్కారం, వక్ఫ్ ఆస్తుల సర్వే తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, సిపిఒ ప్రసన్నలక్ష్మి, డిపిఒ భారతి సౌజన్య, వ్యవసాయశాఖ అధికారి కె.త్రినాథస్వామి, ఐసిడిఎస్, డ్వామా, హౌసింగ్ పీడీలు బి.శాంతిశ్రీ, సుధాకర్, నగేష్, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పట్టుబడిన ప్రేమోన్మాది

చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు



బూర్జ: విశాఖపట్నంలోని మధురవాడ స్వయంకృషి నగర్‌లో యువతి, ఆమె తల్లిపై ప్రేమోన్మాది బుధవారం కత్తితో దాడి చేసిన ఘటనలో తల్లి మృతి చెందగా, యువతికి తీవ్ర గాయాలయ్యాయి. దాడి అనంతరం నిందితుడు నవీన్ జిల్లాకు చేరుకోగా, పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఘటన అనంతరం నిందితుడు విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్నట్లు ఉన్నతాధికారుల సమాచారం మేరకు ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి ఆదేశాలతో శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద పర్యవేక్షణలో ప్రత్యేకంగా నాలుగు పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, పక్కా సమాచారంతో నిరంతరం గాలిస్తూ బూర్జ మండలం కొండపేట వద్ద జె.ఆర్ పురం సిఐ ఎం.అవతారం ఆధ్వర్యాన పోలీసు సిబ్బంది చాకచక్యంగా నిందితుడిని అదుపులోకి తీసుకుని, విశాఖ సిటీ పోలీసులకు అప్పగించారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్‌పి మహేశ్వర రెడ్డితో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బందిని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి అభినందించారు.

ఎంఎస్‌ఒ ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లకు ఎంఎస్‌ఒగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం కమిటీని నియమించి అర్థాంతరంగా విరమించుకుందని, ఈ కమిటీని పునరుద్ధరించి న్యాయం చేయాలని జిల్లా సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ల సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కోరారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. ఎంటెక్, పిహెచ్‌డి, బిటెక్, పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసి ఐటి రంగంలో పనిచేస్తున్న వారు ప్రభుత్వ ఉద్యోగమని భావించి డిజిటల్ అసిస్టెంట్లుగా ఉద్యోగాల్లో చేరామని చెప్పారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న తమకు టెక్నికల్ రంగం వైపు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలో ప్రజలు తమ సమస్యలను విన్నవించుకునేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు


అభినందిస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

విజిలెన్స్ అవేర్నెస్ వీక్ సందర్భంగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థ 'కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రొస్పెరిటీ' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిటెక్ ఇఇఇ కోర్సులో రెండో ఏడాది చదువుతున్న కె.వినోదిని, పి.పవిత్ర, జె.ప్రకాష్, జె.తరుణ్లు ప్రతిభ కనపరచారని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను బుధవారం అభినందించారు. మరిన్ని పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరచాలని డైరెక్టర్ ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ డి డాక్టర్ డి.విజయకుమార్, ఎపిఎస్ఎస్డిసి స్కిల్ డాక్టర్ బి.రామారావు, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు అశోక్ గంగులు కె.కనకరాజులు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావుతో పాటు అభినందించిన వారిలో ఉన్నారు.

రైల్వే అభ్యర్థులకు ఉచిత శిక్షణ

శ్రీకాకుళం అర్బన్: రైల్వేలో ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణను రామ్కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ (గ్రీన్ల్యాండ్) సంస్థల ఉచితంగా అందించనున్నాయి. ఈ మేరకు ఆయా సంస్థల ప్రతినిధులు ఎం.వి.రామిరెడ్డి, గద్దె భాస్కర్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు గ్రూప్- డి పరీక్ష ద్వారా ఖాళీల భర్తీ చేయనున్న నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఇదో సువర్ణావకాశమని వారు పేర్కొన్నారు. ఈ నెల 5న రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. విజయం సాధించిన అభ్యర్థులకు శ్రీధర్ సిసిఎప్ సంస్థ నేతృత్వంలో 3 నుంచి 4 నెలల పాటు హైదరాబాద్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు శిక్షణతో పాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తారు. ఎపిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, కర్నూల్లో వంద మార్కులకు నిర్వహించే అర్హత పరీక్షను 90 నిమిషాల్లో రాయాల్సి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ టెలిగ్రామ్ గ్రూపును ఫాలో కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు రామ్కీ ఫౌండేషన్ ప్రతినిధి రేష్మ, 919515658033 నంబర్ను సంప్రదించాలన్నారు.

ఆటిజం పిల్లలకు థెరపీ అవసరం


పొందూరు : ఆటిజంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పుట్టిన మూడు నెలల్లో శిశువు తల్లిని గుర్తు పడుతుందని, చూపులు కలపడం, నవ్వడం జరుగుతుందని అయితే ఆటిజం ఉన్న పిల్లల్లో ఆ లక్షణాలేవీ కనిపించవని క్లినికల్ సైకాలజిస్టు డా. ఆర్ రాజకుమార్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో జిల్లా బాల భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకటరావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో సైకాలజిస్టు మాట్లాడారు. దేశంలో దాదాపు 2 శాతం పిల్లలకు ఈ రకమైన జబ్బుతో బాధపడు తున్నారన్నారు. ఆటిజానికి కచ్చితమైన చికిత్స అంటూ లేదని, వారి లక్షణాలను బట్టి ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీ వంటి చికిత్సలు చేసుకోవాలన్నారు. ఇటువంటి చికిత్సలు శ్రీకాకుళం, టెక్కలిలో జిల్లా బాల భవిత కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నూక చైతన్య, ఫిజియోథెరపిస్ట్ బి.సత్యవతి, డెంటల్ డాక్టర్ కుసుమలత, ఆడియో టెక్నీషియన్, స్పీచ్ థెరపిస్ట్ అఖిల తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహిత ఉపాధ్యాయులు కంచరాన దినేష్ ఆటిజం పిల్లల పుట్టుకకు కారణాలు, వారి లక్షణాలు, వారు ఎదుర్కొనే సమస్యలను తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం ఆటిజంపై సమాజం చైతన్యం కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు లక్ష్మణరావు, ఐఇఆర్ రాధారాణి, వికలాంగ పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కోటబొమ్మాళి : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న రాజకుమార్

కవిటి: ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బి.వరలక్ష్మి అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి ఆటిజం కారణాలు, దాని గుర్తింపు, ఆటిజం పిల్లల పట్ల వ్యవహరించవలసిన తీరుపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు కృష్ణారావు, అరుణ్కుమార్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక భవిత కేంద్రంలో ఆటిజంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్, సిబ్బంది దేవమణి, శరత్చంద్ర, ఫిజియోథెరపి వైద్యులు డాక్టర్ జి.కిరణ్, ఎంపిపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానికంగా ఉన్న భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సం సందర్భంగా ప్రధానోపాధ్యాయులు టి.శివకుమార్ పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు ఎస్.సూర్యం, హెచ్.సోమేష్, స్పెషల్ ఎడ్యుకేటర్ ఎ.తేజేశ్వరరావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి

ప్రజాశక్తి - కంచిలి

సోంపేట రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి సంభవించిన రైలు ప్రమాదంలో గుర్తుతెలియని గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు పలాస రైల్వే పోలీసులు తెలిపారు. బుధవారం వేకువజామున రైల్వే ప్లాట్ఫారం సమీపంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం ఛిద్రమై కనిపించినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం పోలీసులకు అందజేశారు. హెచ్సి హరినాథ్ మృతదేహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి వయసు సుమారు 40 నుంచి 45 ఏళ్లలోపు ఉంటుందని, గులాబీ, పసుపు రంగు పైజామా, నీలిరంగు ప్యాంటు ధరించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

8 మంది జూదరుల అరెస్టు

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని నర్సిపురం లేఅవుట్ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.60.400 నగదు, ఆటో, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఆర్.నర్సింహమూర్తి బుధవారం తెలిపారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో జూదరులను అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పేకాట శిబిరాలపై నిఘా పెట్టామని అన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామానాయుడు

మున్సిపల్ కార్పొరేషన్ డిఇగా కార్తీక

శ్రీకాకుళం : మున్సిపల్ కార్పొరేషన్ డిఇగా కె.కార్తీక్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నంలోని యుడిఎలో డిఇగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామానాయుడు, విజయ్, మహేష్, కామేష్ రాజు, రామారావు సూర్య, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.


పలాస : మెమొంటోలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యతోనే విద్యార్థుల భవిష్యత్

ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ బాబూరావు

ప్రజాశక్తి - పలాస

విద్యార్థులు నిరంతరం చదువుపై దృష్టి సారించాలని, చదివే ఉన్నత శిఖరాలను తీసుకెళ్తుందని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. పలాసలోని మదర్ థెరిసా విద్యాలయం ఆవరణలో ఉన్న జ్యోతిరావుపూలే పాఠశాలలో బుధవారం ఫెర్వెల్ నిర్వహించారు. మాట్లాడుతూ విద్య చేతిలో ఉంటే ఎక్కడైనా విజయం సొంతమవుతుందన్నారు. విద్యార్థులకు పదో తరగతి, ఇంటర్మీడియట్ దశ కీలకమన్నారు. ఆ సమయంలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థుల చదువు, అలవాట్లపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. అనంతరం పాఠశాల చైర్మన్ వజ్జ బాబూరావు, పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవానికు ఘనంగా సన్మానించారు. అలాగే గతేడాది పదో తరగతి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన జి.లక్ష్మీప్రసన్న తల్లిదండ్రులు, కబడ్డీ పోటీలో నేషనల్ గోల్డ్ ఛాంపియన్ పి.యశోద, రాష్ట్రస్థాయి గోల్డ్ ఛాంపియన్ ఎ.మేఘనకు సన్మానించారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో జోగారావు, కూర్మారావు, శశిరేఖ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం పంచాయతీ నందవ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కె.అరుణ అధ్యక్షతన బుధవారం ప్రషర్స్ డే వేడుకలు నిర్వహించారు. 5వ తరగతి చదువుకున్న విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు చేస్తూ తోటి విద్యార్థులను ఉత్సాహపరిచారు. ముఖ్యఅతిథిగా మండల వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, పద్మనాభరావు, ఎస్ఎంసి చైర్మన్ విశాఖరావు, వైస్ చైర్పర్సన్ కుమారి పాల్గొన్నారు.


పలాస : వినతలు స్వీకరిస్తున్న గౌతు శిరీష

ప్రజా సమస్యలపై దృష్టి

ప్రజాశక్తి - పలాస

పలాస నియోజకవర్గం పరిధిలోని ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధి నుంచి బుధవారం నిర్వహించిన ప్రజా దర్బార్లో 62 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి పట్టిపీడిస్తున్న తాగునీటి సమస్య ఈ వేసవిలో పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే తాగునీరు సరఫరాకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని తెలిపారు. పలు ప్రాంతాల్లో పనులూ చేపడుతున్నామన్నారు. మరోవైపు ఎంపీ నిధులతో పవర్ బోర్లు నిర్మాణం చేపట్టి తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పలు వార్డుల్లో ముమ్మరంగా సిసి రోడ్లు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

పాతపట్నం : మండలంలోని పెద్దలక్ష్మీపురం పంచాయతీలో ఎస్సి, బిసిలు పదేళ్లుగా జీవనోపాధిగా సాగుచేస్తున్నారని సర్పంచ్ అన్నెపు ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నిర్వహించిన ప్రజాదర్బార్, తహశీల్దార్ ఎస్.కిరణ్కుమార్లకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు ఎటువంటి పట్టాలు గాని, భూమి హక్కులను ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ... వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

హేతుబద్ధత లేని ఎస్సి వర్గీకరణ

నగరంలో భారీ ప్రదర్శన డిఆర్ఒకు వినతి


శాంతి ప్రదర్శనలో పాల్గొన్న రెల్లి సంక్షేమ సంఘ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న ఎస్సి వర్గీకరణకు హేతుబద్ధత లేదని అందువల్ల వర్గీకరణను తక్షణమే నిలుపుదల చేయాలని జాతీయ రెల్లి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఏడురోడ్ల కూడలి నుంచి కలెక్టరేట్ వరకు రెల్లి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన శాంతియుత ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో ఆయన హాజరై మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణలో రెల్లి కులాలకు తీరని అన్యాయం జరుగు తోందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి ఆర్థిక, సామాజిక, ఉద్యోగ, ఉపాధి వెనుకబాటు తనాన్ని గుర్తించి వర్గీకరణలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎబిసిడి వర్గీకరణ వల్ల రెల్లి కులానికి అన్యాయం జరిగిందన్నారు. కులగణన చేపట్టి జిల్లాను యూనిట్గా తీసుకుని విభజన చేపట్టాలన్నారు. రాష్ట్రంలో విద్య, ఉద్యోగ నియామకాల్లో ఆర్టికల్ 371 (డి) అనుసరించి అవకాశాలు కల్పించాలన్నారు. ఉత్తరాంధ్రలో నాలుగు శాతం రిజర్వేషన్కు అర్హత ఉన్న రెల్లి కులాలకు ఒక శాతం కేటాయించడం, తక్కువ జనాభా కలిగిన గ్రూపు-బి మాదిగ కులాలకు ఆరున్నర శాతం కేటాయించడం అశాస్త్రీయమన్నారు. అనంతరం కలెక్టరేట్కు చేరుకుని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావుకు వినతిప్రతం అందజేశారు. ప్రదర్శనలో రెల్లికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అర్జి కోటి, నగర అధ్యక్షులు ఎ.ఈశ్వరరావు, రెల్లి ఉప కులాల నాయకులు కాశీ రథో, గోడలి మిన్ను, దండాసి దుర్యోధన, బైరి శివప్రసాద్, దేవర రాము తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న డాక్టర్ శరత్కుమార్

బాధితులను ఆదుకుంటాం

మెళియాపుట్టి: మండలంలో కరజాడకు చెందిన సారా రామయ్య, దాసరి శ్రీనివాస్, దాశరి డిల్లేశ్వరరావుకు సంబంధించిన గొర్రె పిల్లలు గూడుల్లో ఉన్నాయి. గూడుకు గుర్తు తెలియని వ్యక్తులు అగ్గిపెట్టడంతో గొర్రె పిల్లలు మృతి చెందారు. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి, దంత వైద్యులు సలాన శరత్కుమార్ బుధవారం బాధితులను పరామర్శించారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో గోకర్ణపురం సర్పంచ్ సేనాపతి రవికుమార్, పడ్డ దిల్లేశ్వరరావు, ఎన్.రవికుమార్ పాల్గొన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆంధ్రప్రదేశ్ మినిస్టీరియల్ మున్సిపల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎంప్లాయిస్ యూనియన్ డైరీని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీప్రసాద్ ఆవిష్కరించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్లో డైరీని ఆవిష్కరించి అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డైరీలో మున్సిపల్ ఉద్యోగులకు సంబంధించిన సమగ్ర సమాచారం ముద్రించారని చాలా బాగుందన్నారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. పురపాలక సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ తమ్మినేని గోవిందరావు, మున్సిపల్ ఉద్యోగులు పివిబికె రాజు, చక్రవర్తి, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, తమ్మినేని అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ఎచ్చెర్ల: రాజీవ్ గాంధీ యునివర్సిటీలో శక్తి యాప్పై అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ రవి శక్తియాప్పై విద్యార్థులకు వివరించారు. అత్యవసర సమయంలో శక్తి యాప్ను ఏ విధంగా వినియోగించాలో తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ బాలాజీ, ఎఒ ముని రామకృష్ణ, డీన్ శివరామ కృష్ణ, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ గేదెల రవి, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న కోదండకృష్ణ

ఆర్థికసాయం అందజేత

సోంపేట : మండలంలోని మామిడిపల్లి పంచాయతీ పాతినవలసలో పునర్మిస్తున్న కాశీనీలకంఠేశ్వర ఆలయానికి రామకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రెయ్యి కోదండకృష్ణ ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు బుధవారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు రూ.1.116 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో తిమ్మల వీరాస్వామి, గోరకల రామారావు, గోరకల చిన్న లక్ష్మీనారాయణ, గొరకల దొరబాబు, నీటి సంఘాల అధ్యక్షులు దున్న వీరాస్వామి, మాస్టర్ లక్కోజి రవి, దాసరి బలరామ్, తెలుకుల ప్రేమ కుమార్ పాల్గొన్నారు.

వైసిపి మండల కమిటీ నియామకం

ఎచ్చెర్ల: వైసిపి మండల ఉపాధ్యక్షులుగా బొంతల కోడూరు ఎంపిటిసి మాడుగుల జగదీశ్వర రావు, ఫరీద్పేటకు చెందిన కోటిపాత్రుని హరికృష్ణ, జనరల్ సెక్రటరీగా వైసిపి నాయకులు కొత్తకోట సూర్యారావు, కోన వరప్రసాద్, దుంప ఈశ్వరరావు నియమితులయ్యారు. తమకి అవకాశం ఇచ్చిన నియోజకవర్గ సమన్వయకర్త కిరణ్ కుమార్, వైసిపి మండల అధ్యక్షులు బోర సాయిరాం రెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావుకు మండల నూతన కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.

ప్రాజెక్టుల పూర్తికి కృషి చేయాలి

ప్రజాశక్తి - కవిటి

నియోజకవర్గ పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని బిసి వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, బిసి సెల్ రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైయిర్ చౌదరి లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విప్ అశోక్ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1963-65 మధ్య నిర్మించిన పైడిగాం ప్రాజెక్టు ప్రస్తుతం అవసాన దశలో ఉందన్నారు. 2018 తిత్లీ తుపానుకు ముఖ్యమైన నిర్మాణం కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు మరింత నిరుపయోగమైందని అన్నారు. పైడిగాం ప్రాజెక్టు పరిధిలో అధికారికంగా 5 వేలు, అనధికారికంగా 10వేల ఎకరాల్లో సాగు అవుతుందని తెలిపారు. పైడిగాంకు ఉన్న 16 కి.మీ. ప్రధాన కాలువకు చెందిన సైఫూన్స్ పాడై వచ్చిన నీరు నిరుపయోగంగా సముద్రంలోకి పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా వెంటనే వాటికి పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో శివారు గ్రామాలైన నారాయణపురం, గోకర్ణపురం, జలంత్రకోట, బూరగాం, సోంపేట, పలాసపురం, జింకిభద్ర, బెంకిలి గ్రామాల్లో వ్యవసాయం నిర్వీర్యమవుతుందని విప్కు వివరించారు. అలాగే రాజుల కాలం నాటి తవ్వకాలైన గంగాసాగరం, ముకుంద సాగరం, పద్మనాభ సాగరం, గోవింద సాగరం, సుంకులి సాగరం, లొద్ద రిజర్వాయరు, హనుమంతు సాగరాలకు మరమ్మతుల చేస్తే ఇచ్ఛాపురం నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందని అన్నారు. వీటికి తోడుగా బహుదా నదిపై 3 ఎత్తిపోతల పథకాలు, మహేంద్రతనయా నదిపై బారువ గ్రోయన్, పొత్తంగి గ్రోయన్లకు మరమ్మతులు చేస్తే సాగునీటి సమస్యలకు చాలావరకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన విప్ సిఎం దృష్టికి తీసుకెళ్లి సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బిసి సంఘం సభ్యులు గేదెల దేవరాజు, ఇరోతు శ్రీనివాస్, గుండ కృష్ణమూర్తి, తెప్పల నారాయణస్వామి, గార కృష్ణమూర్తి, దూగాన రామూర్తి, సి.హెచ్.నీలయ్య పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న సభ్యులు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నీటితొట్టె ఏర్పాటుకు శంకుస్థాపన

పోలాకి: పశువులకు, పక్షులకు, సమస్త జీవ కోటి జీవనాధారం నీరని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని మబగాంలో వేసవికాలం నీటి ఎద్దడి నుంచి కాపాడేందుకు నీటి తొట్టెలు ఏర్పాటు చేసేందుకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే మూడు నెలలు నీటి ఎద్దడి ఎండలు తీవ్రంగా ఉంటుందని అన్నారు. నీటి ఎద్దడి నివారణకు గుంతలు ఏర్పాటు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

నాటుసారాకు బెల్లం తరలిస్తే చర్యలు

ఎక్సైజ్ సిఐ కృష్ణారావు


కృష్ణారావు, ఎక్సైజ్ సిఐ

ప్రజాశక్తి - పాతపట్నం

మండలంలోని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటుసారా తయారీదారులకు బెల్లం తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ కృష్ణారావు హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కోనంగి, బొన్ని, పూతికగూడ తెంబూరు, గంగువాడల్లో 13 బెల్లం వ్యాపారులకు బుధవారం నోటీసులు అందజేశామన్నారు. అలాగే తహశీల్దార్ ఎస్.కిరణ్కుమార్ వద్ద బెల్లం వ్యాపారులను హాజరుపరిచామన్నారు. నాటుసారా తయారీదారులు బెల్లం అడిగితే పాతపట్నం ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బెల్లం అమ్మినట్లు రుజువైతే శాఖాపరంగా వ్యాపారులకు రూ.2 లక్షలు అపరాధ రుసుం, రెండేళ్ల పాటు బైండోవర్ కేసు నమోదు చేస్తామని తెలిపారు.


ఆస్పత్రి రోడ్డులో ఒరిగిన విద్యుత్ స్తంభం

ఒరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - గుజరాతీపేట

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఆర్ట్స్ కళాశాలకు వెళ్లే దారిలో విద్యుత్ స్తంభం సరిగా ఏర్పాటు చేయకపోవడంతో పక్కకు ఒరిగిపోయింది. విద్యుత్ స్తంభానికి ఆనుకుని కిందన ఉన్న పైపులైన్ విరిగి నీరు అధికంగా రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో ఆ రహదారిలో ప్రయాణించే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. వాహన రాకపోకలకు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులతో పాటు విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని పలువురు కోరుతున్నారు.


ధర్నా చేస్తున్న ఆర్టిసి ఉద్యోగులు

ఆర్టిసి ఉద్యోగుల ధర్నా

పలాస : ఆర్టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు డిపో ఎదుట బుధవారం మధ్యాహ్న భోజన విరామ సవమయంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1/2029 సర్క్యులర్లను అన్ని డిపోల్లో అమలు చేయాలన్నారు. అన్ని రకాల సిక్లపై కమ్యూటేషన్ లీవ్ ఇచ్చి పూర్తి జీతం ఇవ్వాలన్నారు. డ్యూటీకి వచ్చి డ్యూటీ లేనప్పుడు మస్టర్ ఇవ్వాలన్నారు. శ్రీకాకుళం-2 డిపోలో ఉన్న 9 మంది డ్రైవర్లను పలాస డిపోకు బదిలీ చేసే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలన్నారు. మహిళలకు మూడు రోజులు సెలవు, చైల్డ్కేర్ సెలవు ఇవ్వాలన్నారు. పలాస డిపోలో డిసి (ఇ) సెక్షన్లో డే షిఫ్ లో ఇద్దరు ఎడిసిలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉద్యో గోన్నతులు కల్పించాలన్నారు. ఎలక్రికల్ బస్సులను ప్రభుత్వం, సంస్థ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. నైట్ అలవెన్స్ రూ.400కు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిపిటిడి, ఎన్ఎంయు నాయ కులు ఎ.వి.రావు, డి.సిహెచ్.రావు, హెచ్.వి.మూర్తి, పి.వాలి, డి.ఎస్.రావు, పార్వతీశం, టి.డి.రావు పాల్గొన్నారు.

ఆవు దాడిలో బాలికకు గాయాలు

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడలో ఆవు దాడి చేసిన ఘటనలో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నౌపడకు చెందిన సాహుకారి జోగారావు కుమార్తె షణ్ముఖ ప్రియ 8వ తరగతి చదువుతుంది. బుధవారం సాయంత్రం గ్రామంలోని బజారు వీధిలో ట్యూషన్ నుంచి తోటి విద్యార్థులతో కలిసి ఇంటికి వస్తుంది. రోడ్డుపై ఉన్న ఆవులు గుంపులో ఒక ఆవు బాలికపై ఒకసారిగా దాడి చేసింది. ఈ ఘటంలో బాలిక ఎగిరి కింద పడింది. దీంతో బాలిక ఎడమ చెయ్యి విరిగి తీవ్రంగా గాయపడింది. రోధిస్తున్న బాలికను గుర్తించిన స్థానికులు నౌపడ పిహెచ్సిలో ప్రథమ చికిత్స అందించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. నౌపడలో పశువుల పెంపకందారులు పశువులను గుంపులుగా రైతులు రోడ్లపై వదిలేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై అధికారులతో తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చలివేంద్రం ఏర్పాటు

నందిగాం : మండల కాంప్లెక్స్ సమీపంలోని జాతీయ రహదారి పై ఓవర్ బ్రిడ్జి కింద బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. అనునిత్యం మండల కేంద్రానికి వివిధ పనులపై వచ్చిన వారికి ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రమణబాబు, కె.సతీష్, కె.సందీప్, బి.లోకేష్ పాల్గొన్నారు.


చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న కార్యదర్శి రమణబాబు

బిసి రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - రణస్థలం

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా బిసి సొసైటీ నుంచి వివిధ రకాల రుణాల కోసం చేసుకున్న 1398 దరఖాస్తులను ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, ఎఒ వి.ధనుంజయరావు ఆధ్వర్యంలో బిసి కార్పొరేషన్ అధికారులు, 12 బ్యాంకుల నుంచి వచ్చిన సిబ్బంది పరిశీలన చేశారు. దరఖాస్తుదారులకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయడానికి అర్హుల జాబితాను జిల్లా కేంద్రానికి పంపిస్తామన్నారు.

ఇచ్ఛాపురం : బిసి కార్పొరేషన్ రుణాలకు 413 దరఖాస్తు చేసుకోకగా, 402 మంది లబ్ధిదారులు హాజరయ్యారని ఎంపిడిఒ రామారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకు అధికారులతో బుధవారం దరఖాస్తులను పరిశీలించారు. ప్రతి పంచాయతీ నుంచీ భారీగా బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసు కున్నారు. దీంతో నాయకులతో, లబ్ధిదారులతో కార్యాలయం కిటకిటలాడింది.

నేడు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

బిసి రుణాల లబ్ధిదారులకు గురువారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో 10.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వెనుకబడిన తరగతుల వారికి, అగ్రవర్ణాల్లో పేదలకు (ఇడబ్ల్యూఎస్), కమ్మ, రెడ్డి, ఇబిసి క్షత్రియ, బ్రాహ్మణ తరగతులకు సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలను మంజూరు చేయుటకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న 396 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువ పత్రాలతో హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.


ఇచ్ఛాపురం : దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

పారదర్శకతకు పాతరేనా..?

- చక్రం తిప్పుతున్న కూటమి నేతలు
- సిఫార్సులకే కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు!
- వేయికళ్లతో చూస్తున్న దరఖాస్తుదారులు

ప్రజాశక్తి - రణస్థలం

స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవడానికి యువత సబ్సిడీ రుణాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. వివిధ కార్పొరేషన్ల కింద రుణాలు పొందడం కోసం వేల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతకు పాతరేసి సిఫార్సులు ఉన్నవారికే రుణాలు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. కూటమి నాయకులు పప్పుబెల్లాలు మాదిరి తలా ఇన్ని యూనిట్లు అని అనుయాయులకు కట్టబెట్టేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూసి అలసిపోయిన యువత కనీసం స్వయం ఉపాధి రంగంలోనైనా స్థిరపడదామనుకుంటున్నారు. ఇందుకు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తుండగా బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు నోటిఫికేషన్ వెలువడింది. 50 శాతం రాయితీ వర్తించేలా బిసి కార్పొరేషన్ ప్రకటించాయి. అంతే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి.

రేపట్నుంచి శ్రీరామనవమి వేడుకలు

కోటబొమ్మాళి: మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడులో ఈనెల 4 నుంచి 6 వరకు శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త సనపల కరుణ్కుమార్ అన్నారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంట నుంచి అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు.

గుళికలతో విత్తనాలకు రక్షణ



ఆమదాలవలస : రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- ఆమదాలవలస

విత్తన గుళికలతో విత్తనాలకు రక్షణ ఉంటుందని డిజిటల్ యల్‌టు చేపేన సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని చేపేనపేట యూనిట్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమక్షంలో యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యంలో రైతులకు విత్తన గుళికలు తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులకు విత్తన గుళికల తయారీ విధానంపై అవగాహన కల్పించామని తెలిపారు. పూర్తిగా నీరు అందుబాటులో లేని పొలాల్లో విత్తనాలను విత్తన గుళికలుగా తయారు చేసుకుని వేసుకున్నట్లయితే విత్తనాలు పాడవకుండ సంరక్షించబడతాయని తెలిపారు. ఈ సందర్భంగా విత్తన గుళికల ఉపయోగాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

పాతపట్నం: విత్తన గుళికలు దినోత్సవం సందర్భంగా మండలంలోని బడ్డుమర్రి గోపాలపురంలో ఎన్ఎఫ్ ఎ.గోవిందరెడ్డి ఆధ్వర్యాన బుధవారం విత్తన గుళికలు తయారు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బంకమట్టి విత్తనాలను ఆచరణీయంగా చేస్తుందన్నారు. ఘన జీవామృతం బయోఇనోక్యులమ్‌గా పనిచేస్తుందన్నారు. బూడిద పూత ఘనజీవామృతం, బంకమట్టిలో ఉన్న తేమను గ్రహించడం ద్వారా తేమ స్థాయిని నియంత్రిస్తుందన్నారు. ఈ విధానం ద్వారా వివిధ రకాల విత్తనాలను సులభంగా గుళికలుగా మార్చుకొని, మెరుగైన మొలక శాతం, మొక్కల పెరుగుదలను పొందవచ్చనీ తెలిపారు. కార్యక్రమలో ఐసిఆర్‌పిలు, కమ్యూనికేషన్ శ్రావ్య, రైతులు పాల్గొన్నారు.



కొత్తూరు : విత్తనాలను తయారు చేస్తున్న రైతులు

కొత్తూరు : మండలం కేంద్రంలో గుళికల విత్తనాల తయారీపై డిపిఎం రేవతి అవగాహన కల్పించారు. ఏప్రిల్ నెలలో పంటలు లేని పొలాల్లో గుళికలు వేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎంటి సూర్యనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జి చిన్నమ్మి, ఐసిఆర్‌పిలు రమణమ్మ, భూదేవి, చిన్న, ఫార్మర్ సైంటిస్ట్ సుభాషిణి, రైతులు గోవింద్, ఎండు చౌడవరపు గోవిందరావు, కృష్ణమ్మలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంత పాలన

మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ప్రజాశక్తి- పాతపట్నం

రాష్ట్రంలో రెడ్‌బుక్ పేరుతో నియంత పాలన సాగుతుందని మాజీ ఎమ్మెల్యే, వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు రెడ్డి శాంతి ఒక ప్రకటనలో విమర్శించారు. సూపర్ సిక్స్ అన్నారు... అమలు చేయమంటే తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెడుతున్నారని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం ఇస్తామన్న పథకాలన్నీ మోసాలుగా మిగిలైపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. అమ్మకు వందనం లేదు.. రైతు భరోసా లేదు.. ఆసరా లేదు.. నిరుద్యోగ భతి లేదు.. ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదు... ఇన్ని తరగతుల వారినీ మోసం చేసిన చంద్రబాబుపై కేసులు పెట్టాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.1,500 నగదు, తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలు చదివితే అందరికీ రూ.20 వేలు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

7 నుంచి వార్షిక పరీక్షలు

టెక్కలి : ప్రభుత్వ విద్యాశాఖ ఆధీనంలో ఉన్న అన్ని రకాల యాజమాన్యల పాఠశాలలకు ఈ నెల 7 నుంచి వార్షిక పరీక్షలు (సమ్మెటివ్-2) నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. 7న ప్రారంభమయ్యే పరీక్షలు 17 వరకు నిర్వహిస్తారు. మొదట 9న నుంచి పరీక్షలు అని భావించారు. తాజాగా 7 నుంచి నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఉదయం 9 నుంచి మద్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 9వ తరగతి విద్యార్థులకు మాత్రం అదనంగా మరో పదిహేను నిమిషాల పాటు పరీక్ష నిర్వహించనున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల మాదిరిగా 9వ తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలు పూర్తయిన వెంటనే విద్యార్థులు రాసిన జవాబుపత్రాలకు మూల్యాంకనం చేపట్టి 20 లోగా హోలిస్టిక్ ప్రగతిపత్రాల్లో నమోదు చేశారు. అనంతరం విద్యార్థులకు అందించి తల్లిదండ్రులతో సంతకాలు పెట్టించి వాటిని తీసుకోవాలి. 23న చివరి రోజు తరువాత 24 నుంచి వేసవి సెలవులు మంజురు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన కాల నిర్ణయపట్టిక ఆదేశాలు జారీ చేశారు. ఆయా మండలాల విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఎన్నడూ లేని విధంగా ఈ సారి వార్షిక పరీక్షలు ముందస్తుగానే నిర్వహించడం గమనార్హం.



కొలతలు వేస్తున్న అధికారులు

రోడ్డు విస్తరణకు కొలతలు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి అంబేద్కర్ కూడలి నుంచి చింతలగార, భగవాన్‌పురం గ్రామాలని కలుపుతూ ఉన్న రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రస్తుతం ఉన్న రోడ్డు ఇరుగ్గా ఉండడంతో విస్తరించాలని పాలకులు, ఆదికారులు ఎప్పటి నుంచో ఆలోచన చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు సంయుక్తంగా కొలతలు చేపట్టి రోడ్డు విస్తరణకు మార్కింగ్ వేశారు. 40 అడుగుల రోడ్డుగా విస్తరణ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన కొలతలు వేయడంతో రోడ్డు పక్కన ఉన్న చిరువ్యాపారులు, నివాసగృహ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణం పరిధి విస్తరించడంలో భాగంగా నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే ఈ మార్గం విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ మార్గం ద్వారానే టెక్కలి రైల్వేస్టేషన్‌కి, జాతీయ రహదారికి చేరుకోవడానికి ఆనుగుణంగా ఈ రోడ్డు ఉండడంతో మార్గం విస్తరణ అవసరం ఉంది. కొలతలు వేసి ప్రాథమిక నివేదిక చేపట్టి ఉన్నతస్థాయి అధికారులు అందిస్తామని చెబుతున్నారు.



చంద్రబాబుతో ఎమ్మెల్యే ఈశ్వరరావు

సిఎంను కలిసిన ఎమ్మెల్యే ఎన్ఇఆర్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

నియోజకవర్గంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టు కాలువ నిర్మాణ పనులు పూర్తిచేసి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు నియోజకవర్గం కూటమి నాయకులను తీసుకుని సిఎం చంద్రబాబును ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు నీ పనితీరుతో నాయకులను, ప్రజలను ఆకట్టుకుంటున్నావంటూ ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌ని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సమస్యలను విన్న సిఎం ఎచ్చెర్ల నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

ఎంపిడిఒగా జయంతిప్రసాద్



జయంతిప్రసాద్, ఎంపిడిఒ

కోటబొమ్మాళి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జయంతిప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపిడిఒగా పనిచేసిన కె.ఫణీంద్రకుమార్ తన వ్యక్తిగత కారణాలు వల్ల తమ విధులకు సెలవులు పెట్టారు. ఆయన స్థానంలో సంతబొమ్మాళి ఎంపిడిఒగా పనిచేస్తున్న జయంతి ప్రసాద్ ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. ఈయనకు మండల పరిషత్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

రాజు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజు

ఇచ్ఛాపురం : ఎపి యాదవ సంక్షేమ, అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి దాసు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో బాధ్యతలను స్వీకరించారు. సంస్థ చైర్మన్ జి.నరసింహ యాదవ్ ప్రమాణస్వీకారం చేయించారు. ఇంతటి అవకాశం ఇచ్చిన పవన్ కళ్యాణ్‌కి రాజు ధన్యవాదాలు తెలిపారు.

కూటమి పాలనలో దళితులకు భరోసా

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

రాష్ట్రంలో కూటమి పాలనలో దళిత వర్గాలకు భరోసా కల్పిస్తుందని మండల వైసిపి నాయకుడు, దళిత సంఘ నాయకుడు రావాడ వెంకటరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో దళిత వర్గాలకు ఎటువంటి రాయితీ రుణాలు మంజూరు చేయలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లో దళిత వర్గాలకు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందజేస్తున్నట్లు ప్రకటించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని దళిత సోదరులందరూ సద్వినియోగం చేసుకొని ఈనెల 11లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ముఖ్యంగా కూటమి పాలనలో దళితుల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు మరింత కృషి చేయాలని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు సిద్ధం

టెక్కలి: పదో తరగతి పరీక్షలు ముగిసి 24 గంటలు కాకముందే ఇంటర్మీడియట్‌లో విద్యార్థులను చేర్చుకోవచ్చునని ఆదేశిస్తూ... ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి క్రితికా శుక్లా ఆదేశాలు జారీ చేశారు. సంస్కరణలో భాగం ఏప్రిల్ ఒకటి నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు బోధన చేపట్టారు. బుధవారం మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నోటిపికేషన్ జారీ చేశారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల హాల్‌టిక్కెట్ల ఆధారంగా ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కల్పించాలన్నారు. నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఈ నెల 7 నుంచి ప్రవేశాలు చేపట్టి తరగతులూ నిర్వహించాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నా రు. కాగా, ఈ నెల 23న చివరి పనిదినంగా పేర్కొంటూ... 24 నుంచి వేసవి సెలవులు మంజూరు చేస్తూ... ఉత్తర్వులు జారీ చేశారు. వేసవి సెలవులు అనంతరం జూన్ 2 నుంచి యథావిధిగా కళాశాలలు తెరుచుకొని ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహించనున్నారు. ఇదిలాఉండగా ప్రస్తుతం అన్ని రకాల యాజమాన్యాల విద్యా సంస్థలకు ఒంటి పూట బడులు నిర్వర్తిస్తుండగా, ప్రస్తుతం తరగతులు నిర్వర్తిస్తున్న ఇంటర్మీడియట్ వారికి మాత్రం రెండు పూటలూ నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, సంస్కరణల్లో భాగంగా అప్పుడే ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు సాధించాలని ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేయడంపై పలువురు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



లావణ్య కుమార్‌ను సత్కరిస్తున్న సభ్యులు

కళాకారునికి సన్మానం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ఎర్రగోవిందపుట్టుగలో బుధవారం ఉత్కల్ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కన్యాకాపరమేశ్వరి కళింగ వైశ్య యువజన సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన వేడుకల్లో కన్నుపుట్టుగకు చెందిన కళాకారుడు హట్టి లావణ్య కుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వైశ్య సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈపరి జగన్నాథరావు, యువజన సంఘం అధ్యక్షుడు చెన్నూరి రమేష్ మాట్లాడుతూ ఉద్యానవనం లాంటి ఉద్దానం ప్రాంతంలో కవులు - కళాకారులకు కొదవలేదని, వారిని సత్కరించుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు. చెన్నూరు లక్ష్మణరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో బి.సంతోష్, సిహెచ్.అనిల్‌కుమార్, ఈపరి రమణమూర్తి, పి.ధర్మారావు, బి.చంద్రశేఖర్, సిహెచ్.రమేష్‌కుమార్, వై.దాలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఘనంగా టిడిపి ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీగా ఆవిర్భవించిన టిడిపి ఆవిర్భావ వేడుకలు అమెరికాలో ఘనంగా నిర్వహించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆధ్వర్యంలో సెయింట్ లూయిస్‌లో టిడిపి ఎన్ఆర్ఐ విభాగం నాయకులు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించినట్టు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 43 ఏళ్లుగా టిడిపి సాధిస్తున్న విజయాలను ప్రస్తావించారు. ప్రస్తుత సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఎన్ఆర్ఐలు ఎపిలో పెట్టుబడులు పెట్టి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు.



ఆస్పత్రిలో పింఛను అందజేస్తున్న అంగన్వాడీ కార్యకర్త అన్నపూర్ణ

ఆస్పత్రిలో పింఛను అందజేత

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరుకు చెందిన చేనేత కార్మికుడు కొమ్మాన మల్లికార్జునరావు అనారోగ్యంతో బాధపడుతూ గత కొన్నాళ్లుగా శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో మార్చి, ఏప్రిల్ రెండు నెలల పింఛన్‌ను ప్రభుత్వం రూ.8 వేలు మంజూరు చేయడంతో ఫించన్ నగదును అంగన్వాడీ కార్యకర్త బాసిన అన్నపూర్ణ పత్ర తన సొంత ఖర్చులతో శ్రీకాకుళం వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మల్లికార్జునరావు రూ.8వేలు పింఛను అందజేశారు. అన్నపూర్ణ సేవను పలువురు అభినందించారు.

వాకింగ్ దినచర్యలో భాగం కావాలి



మాట్లాడుతున్న ఇందిరాప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజంలో ప్రతిఒక్కరూ ఎంత బిజీగా ఉన్నా వయసుతో సంబంధం లేకుండా నిత్యం వాకింగ్ చేయాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని నగరానికి చెందిన స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, శాసపు జోగినాయుడు, పీజీ గుప్తా, గుడ్ల జగ్గారావు అన్నారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ నడక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నడక వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. సామాజిక సేవా కార్యక్రమాలు పెద్దఎత్తున వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ చేపడుతుందని, అందులో స్టార్‌వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జాతీయ వాకింగ్ దినోత్సవం సందర్భంగా నూతనంగా 11 మంది సభ్యులు స్టార్ మహిళా వాకర్స్ క్లబ్‌లో చేరారన్నారు. ప్రతిఒక్కరూ విధిగా నడక వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవాలన్నారు. నూతన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో స్టార్‌వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బి.వి.రవిశంకర్, జెసి పట్నాయక్, అడపా శాంతి, జ్యోతి, గేదెల లక్ష్మీ, డాక్టర్ జిఎన్‌రావు, ఎం.మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిరుపేదలకు ఆర్థికసాయాన్ని అందించారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతి డ్వాక్రా సంఘ సభ్యులూ కావాల్సిన రుణ వివరాలు సేకరించి ఆ రుణాల ద్వారా జీవనోపాధి కార్యక్రమం ప్రారంభించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎపి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ఎండి జి.వి.బి.దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక మండల మహిళా సమైక్య భవనంలో వార్షిక రుణ ప్రణాళిక, జీవనోపాధుల ప్రణాళిక ఏన్యూమరేటర్లతో నూతన యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో సంఘాలకు, సంఘ సభ్యులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెర్ప్, ప్రాజెక్టుకు సంఘానికి మధ్య సంధానకర్తగా విఒఎలు వ్యవహరించి ప్రగతి పథంలోకి తీసుకెళాలన్నారు. రుణాలు మంజూరు, వినియోగం, చెల్లింపులపై బాధ్యత వహించాలన్నారు.



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రుణ ప్రణాళిక అమలులో అలసత్వం లేకుండా విజయవంతంగా పని పూర్తి చేకయాలన్నారు. సమావేశంలో ఏరియా కో-ఆర్డినేటర్ సిహెచ్.రామ్మోహనరావు, ఎజిఎం కె.సత్యనారాయన, సెర్ప్ ఎపిఎం ప్రసాదరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

పలాస : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శరీరదారుఢ్యం పెంపొందిస్తుందన్నారు. రోగాలు దరిచేరకుండా శక్తిని చేకూర్చడంతో పాటు స్నేహభావం, సహద్భువ వాతావరణం ఏర్పడుతుందన్నారు. అనంతరం 100, 200 మీటర్ల వరుగు పందెం, ఫాట్పుట్, వాలీబాల్, త్రోబాల్ వంటి వివిద క్రీడా పాటీలు నిర్వహించారు. ఈ పాటీల్లో బాలుర విభగంలో 100 మీటర్ల పరుగుపందెంలో మొదటి బికాం విద్యార్థి డి.ప్రసాదరావు, 2000 మీటర్ల పరుగు పందెంలో రెండో సంవత్సం బికాం విద్యార్థి ఎన్.కె.మగ్‌బాల్ బంగారు పతకాలు సాధించారు. బాలికల విభగంలో 100 మీటర్ల పరుగు వందెంలో రెండో ఏడాది బికాం విద్యార్థిని పి.లక్ష్మి, 200 మీటర్ల పరుగు పందెంలో జె.కుసుమ బంగారు పతకాలు సాదించారని పీడీ డాక్టర్ పి.మధు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతి, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ పి.వి.రమణ, ఎన్ఎసి కో-ఆర్డినేటర్ శ్రీనివాస పట్నాయక్, ఎం.ఎన్.హెచ్.ప్రసాద్, వై.రాజేష్ పాల్గొన్నారు.

హెచ్‌సిసిబి ఆధ్వర్యాన ఆర్‌ఒ ప్లాంట్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రముఖ ఎఫ్ఎంసిజి కంపెనీల్లో ఒకటైన హిందూస్తాన్ కోకాకోలా బేవరేజెస్ (హెచ్‌సిసిబి) ఆధ్వర్యాన సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం, పలాస నియోజక వర్గాల్లో నీటి వడపోత యూనిట్లు (ఆర్‌ఒ ప్లాంట్), సోలార్ వీధిదీపాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు హెచ్‌సిసిబి చీఫ్ పబ్లిక్ అఫైర్స్, కమ్యూనికేషన్స్, సస్టైనబిలిటీ ఆఫీసర్ హిమాన్షు ప్రియదర్శి తెలిపారు. బుధవారం పలాస, శ్రీకాకుళం నియోజక వర్గాల్లో ఆర్‌ఒ ప్లాంట్లును స్థానిక ఎమ్మెల్యేలు గౌతు శిరీష, గొండు శంకర్‌ల చేతులమీదుగా ప్రారంభించారు. కుందువానిపేటలో సౌరశక్తితో నడిచే వీధిదీపాలను ఆయన ప్రారంభించారు. పర్యావరణ అనుకూల మౌలిక సదుపాయాలు భద్రతను పెంచుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌సిసిబి చీఫ్ పబ్లిక్ అఫైర్స్, కమ్యూనికేషన్స్, సస్టైనబిలిటీ ఆఫీసర్ హిమాన్షు ప్రియదర్శి మాట్లాడుతూ నీటి వడపోత యూనిట్ల ఏర్పాటు, సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేయడం, నీటి సదుపాయం, పారిశుధ్యం , పరిశుభ్రత (వాష్) కార్యక్రమాలతో పాటు యువతకు అమ్మకాలు, మార్కెటింగ్ శిక్షణ అందిస్తున్నామన్నారు. పలాస నియోజకవర్గం పరిధిలో బ్రాహ్మణతర్లా, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ఎర్రముక్కాం, ఇసకలపాలెం, నడుమూరు హైస్కూళ్లలో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో వమ్మరవల్లి డైట్ కళాశాలలో సంతబొమ్మాళి, నరసన్నపేట హైస్కూళ్లతో పాటు ప్రభుత్వ సర్వజనాసుపత్రిల్లో ఆర్‌ఒ ప్లాంట్లను ఏర్పాటు చేసినట్టు వివరించారు. అలాగే బేతాళపురం, కొత్తరేవు, కుందువానిపేటలో 60 వాట్స్ సౌరశక్తితో వెలిగే వీధిదీపాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలతో పాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు మొక్కను అందజేస్తున్న హిమాన్షు ప్రియదర్శి

సహజసిద్ధ వనరులతో సాగు మేలు

నైర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. భరత లక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సహజసిద్ధ వనరులు వినియోగించుకుని వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల ద్వారా మెరుగైన ప్రయోజనాన్ని పొందాలని నైర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. భరతలక్ష్మి రైతులకు సూచించారు. బుధవారం శ్రీకాకుళం మండలం సిలగాం సింగువలసలో వ్యవసాయ కళాశాల ఆఖరి ఏడాది విద్యార్థుల జాతీయ సేవాపథకాన్ని నెహ్రూ యువక కేంద్రం డిడి వెంకట్ ఉజ్వల్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురాతన సాగు పద్ధతుల వలన రైతులకు అధిక శ్రమ అవుతోందన్నారు. విద్యార్థులు రైతులకు విత్తన శుద్ధి, చెట్ల పెంపకం, భూసార పరీక్షలు, రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించడంపై అవగహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సేవాతత్పరత పెరిగి ఉత్తమ పౌరులుగా మారాలన్నారు. కార్యక్రమంలో నైరా కాలేజీ ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం అధికారి గోవిందరావు, స్పందన, గ్రామ సర్పంచ్ ప్రతినిధి కంచు వసంతరావు, మాజీ సర్పంచ్ కంచు దశరథుడు, సెక్రటరీ శాంతి స్వరూప్, ప్రొఫెసర్లు సీతారాము, గురువారెడ్డి, రాజేంద్ర ప్రసాద్, పురుషోత్తంరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భరత లక్ష్మి



పంటలను పరిశీలిస్తున్న జెడి త్రినాథస్వామి

పంటలు పరిశీలన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో శ్రీరంగం, తలగాం గ్రామాల్లో జిల్లా వ్యవసాయ అధికారి కె.త్రినాథస్వామి, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఉదయబాబు, డాక్టర్ శ్రీనివాస్‌లు నువ్వులు, వరి పంటలను బుధవారం పరిశీలించారు. నువ్వుల పంట సిలింద్రం వల్ల మొక్క పూర్తిగా ఎండిపోయిందన్నారు. దీని నివారణకు పంట తొలి దశల్లో ఫ్లూడోమోనస్ ఎకరానికి 30 కేజీలు సేంద్రీయ ఎరువులు వేయాలన్నారు. ఇటువంటి సమస్యలు ఉన్న పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాల డైన్చాయ ఎకరానికి 8 కేజీలు లెక్క సాగుచేసిన ఎడల ఈ తెగులు ఉధృతిని తగ్గించవచ్చునన్నారు. అనంతరం వరి పంటలు పరిశీలించి అగ్గి తెగులు అధికంగా ఉందని గుర్తించారు. అగ్గి తెగులు నివారణకు ట్రివైక్లజోల్ ఎకరానికి 120 గ్రాములు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎఒ గురువెల్లి రంగారావు, వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.సుమంత్, గ్రామ వ్యవసాయ సహాయకులు సోనీ, రైతులు చాపర గణపతి పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న చంద్రశేఖర్

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం టిడిపి కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన పలు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే రవికుమార్, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యాలయ సమన్వయ కార్యదర్శి మొదలవలస రమేష్, మండల టిడిపి అధ్యక్షులు నూక రాజు, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు బొడ్డేపల్లి గౌరీపతి, దూసి ఆయకట్టు చైర్మెన్ హనుమంతు బాలకృష్ణ, నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షులు నాగళ్ల మురళీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మెమొంటో అందజేస్తున్న అనుష

రాష్ట్రస్థాయి పోటీలకు బ్రాహ్మణతర్లా ప్రాజెక్టు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రాజెక్టు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి ఇఎండిపి పోటీలకు ఎంపికైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (ఈఎండిపి) ఎగ్జిబిషన్‌లో బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.ప్రణీత్, ఎస్.కార్తీక్, కె.మోక్షజ్ఞ, ఎ.పూర్ణచందు, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో రూపొందించిన అన్వేషి అనే ప్రాజెక్టు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. దీంతో రాష్ట్రస్థాయి ప్రదర్శనకు అర్హత సాధించాయి. ఉప విద్యాధికారి ఆర్.విజయకుమారి, జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమారస్వామి, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, ఉద్యం స్టేట్ లీడ్ సుశాంత్, జిల్లా మేనేజర్ అనుష నుంచి విద్యార్థులు బహుమతిని అందుకున్నారు. శ్రీనివాసరావుకు, విద్యార్థులకు హెచ్ఎం ఎస్.వి.రమణారావు అభినందించారు.



పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర ద్వారా ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కాలేజీల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. మౌలిక సదుపాయాలు కల్పన, ఉచిత మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి, డాక్టర్ సలాన శరత్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రకు సహకరించాలి

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వం అమలు చేస్తున్న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛాంధ్రకు ప్రజలు సహకరించాలని ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి కోరారు. మండలంలోని బల్లిపుట్టుగ, బొరివంక గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ముఖ్యంగా ఇంటి వ్యర్థాలు చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలకు అందేలా సహకరించాలన్నారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి గుణవతి, శ్రీనివాస్, డిజిటల్ అసిస్టెంట్ జైదేవ్, ఎస్‌డబ్ల్యుపిసి క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి